జిల్లాలో ముసురేసిన వాన

కందకుర్తి వద్ద గోదావరిలో ప్రవహిస్తున్న నీరు

ఖిల్లా డిచ్‌పల్లి చెరువులోకి చేరిన వర్షపు నీరు

- పొంగుతున్న వాగులు, చెరువుల్లోకి చేరుతున్న వర్షపు నీరు
- రోడ్లపై నిలిచిన వర్షపునీరు
- పలుచోట్ల కూలిన ఇండ్లు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, జూలై 21 : వర్షాకాలం ప్రారంభమై సుమారు 40 రోజులు కావస్తున్నా వర్షాలు లేక వరుణుడి కరుణ కోసం ఎదురుచూస్తున్న అన్నదాతల్లో రెండు రోజులుగా ముసురు పట్టి కురుస్తున్న వర్షం సంతోషం నింపింది. జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షం కురుస్తున్నది. రెండు, మూడురోజులుగా ముసురు వేయడంతో చెరువుల్లోకి వర్షపునీరు వచ్చి చేరుతున్నది. వాగులు నిండుగా ప్రవహిస్తున్నాయి. పలు చోట్ల పురాతన ఇండ్లు నేలకొరిగాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

కోటగిరి మండలంలో నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాలతో పంటలకు జీవం పోసినట్లయ్యిందని రైతులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. డిచ్‌పల్లిలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఖిల్లా డిచ్‌పల్లి, బర్ధిపూర్, సుద్దులం, యానంపల్లి చెరువుల్లోకి భారీగా వర్షపు నీరు వచ్చి చేరింది. ధర్పల్లి మండలకేంద్రంలోని పెద్దచెరువులోకి మాటు కాలువ ద్వారా భారీగా వర్షపు నీరు వచ్చి చేరుతున్నది. వీడీసీ ఆధ్వర్యంలో మాటు కాలువలో చెత్తా చెదారం తొలగించి, నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టారు.

పొతంగల్ మండలంలోని కొల్లూరు-దోమలెడ్గి వాగు వద్ద బ్రిడ్జి పనులు కొనసాగుతున్నాయి. వాహనదారుల కోసం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డుపై నుంచి వర్షపు నీరు భారీగా ప్రవహిస్తున్నది. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఇందల్వాయి మండలకేంద్రంతోపాటు పలు గ్రామాల్లోని చెరువుల్లోకి వర్షపు నీరు వచ్చి చేరుతున్నది. మండలంలో ఇప్పటివరకు 67.4 మి.మీ. వర్షం కురిసిందని తహసీల్దార్ వెంకట్‌రావు తెలిపారు. రుద్రూర్ మండలంలో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. చిక్కడ్‌పల్లి చెరువు అలుగు పారింది. రుద్రూర్ నుంచి బొప్పాపూర్ వెళ్లే దారిలో వాగు బ్రిడ్జిని తాకి ప్రవహిస్తున్నది. జేఎన్‌సీ కాలనీలో మంకగారి పెద్దబాబు ఇల్లు పాక్షికంగా కూలింది. చందూర్ మండలకేంద్రంలో పలు కాలనీల్లో వర్షపు నీరు ఇండ్లలోకి చేరింది.

జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ స్తంభాలు, కరెంట్ తీగలతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 24 గంటల్లో 88.1 మీమీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. కమ్మర్‌పల్లిలో అత్యధికంగా 25.8 మి.మీ., వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ధర్పల్లిలో 11.0 మి.మీ., ఆలూర్‌లో 7.0లో మి.మీ., వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మరో మూడు రోజుల పాటు వర్షాలు కురవనున్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

వర్షంలోను విద్యుత్ మరమ్మతులు

ఖలీల్‌వాడి, జూలై 21 : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఆ శాఖ అధికారులు మరమ్మతులు చేపడుతున్నారు. అన్ని ఫీడర్లలో మరమ్మతులు చేపడుతుండడంతోపాటు విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగిస్తున్నారు.

ధర్పల్లి మాటు కాలువలో ప్రవహిస్తున్న నీరు

మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల్లోని చెరువులు, వాగులకు జలకళ సంతరించుకుంది. మోర్తాడ్‌లో శనివారం 140 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. వర్షాలు ఎక్కువగా కురుస్తున్నందున పాత ఇండ్లలో ఉంటున్నవారు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలు చెరువులు, వాగుల వద్దకు వెళ్లవద్దని మోర్తాడ్, కమ్మర్‌పల్లి తహసీల్దార్లు సత్యనారాయణ, ఆంజనేయులు సూచించారు. ఆర్మూర్ పట్టణ శివారులోని ఆలూర్ బైపాస్ రోడ్డు వద్ద పంట పొలాల్లోకి వరద నీరు చేరింది. నీటిలో వస్తున్న చేపలను పట్టుకునేందుకు యువకులు తరలివచ్చారు. రెంజల్ మండలంలో 102.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. నవీపేట మండలం జన్నేపల్లి మాటు కాలువ ఉధృతంగా ప్రవహిస్తున్నది. జన్నేపల్లి తదితర గ్రామాల్లో పంట పొలాల్లో నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. ఫత్తేనగర్ గ్రామంలో ఇల్లు కూలిందని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. నవీపేట మండలంలో ఆదివారం 11.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఇరిగేషన్ ఏఈ శ్రీధర్ తెలిపారు. బోధన్ మండలంలోనూ రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. బోధన్ పట్టణ శివారులోని పలు వాగుల్లో నీరు పారుతోంది. బోధన్ ప్రజలకు తాగు, సాగునీరందించే బెల్లాల్ చెరువు, పాండు చెరువు పూర్థిస్థాయిలో నీటితో నిండి అలుగుపై నుంచి నీరు పారుతోంది. బోధన్ పట్టణ శివారులోని బోధన్- నిజామాబాద్‌లోని నర్సాపూర్ వాగులో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. భీమ్‌గల్ మండలంలో కప్పలవాగు చెక్‌డ్యాంపై నుంచి వర్షపు నీరు ప్రవహిస్తున్నది. చెక్‌డ్యాం నిండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తహసీల్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు వర్షం కారణంగా కోతకు గురైంది.

చందూర్‌లో ఇండ్ల మధ్య నిలిచిన నీరు

కమ్మర్‌పల్లిలో నిండుకుండలా మారిన పల్లెచెరువు

పొతంగల్‌లోని కొల్లూరు-దోమలెడ్గి వాగు వద్ద తాత్కాలిక రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వర్షపు నీరు

ఖానాపూర్-కాలూర్ రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

ఉధృతంగా ప్రవహిస్తున్న బొప్పాపూర్ వాగు

రుద్రూర్‌లోని జేఎన్‌సీ కాలనీలో వర్షానికి కూలిన ఇల్లు

అలుగు పారుతున్న బోధన్ బెల్లాల్ చెరువు

డాక్టరేట్ పట్టా పొందిన రమేశ్‌కు సన్మానం



రమేశ్‌ను సన్మానిస్తున్న స్నేహితులు

కోటగిరి, జూలై 21 : కోటగిరికి చెందిన రమేశ్ డాక్టరేట్ (పీహెచ్‌డీ) పట్టా పొందడంతో ఆయన స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం సన్మానించారు. టీయూలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ వర్క్ (సామాజిక శాస్త్ర విభాగం) నుంచి ఉత్తర తెలంగాణలోని సమగర (మోచి) కమ్యూనిటీలో మారుతున్న జీవన ఉపాధి పరిస్థితులపై అధ్యయనం చేసి పీహెచ్‌డీ పొందారు.

త్రిమూర్తి సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపన

సిరికొండ, జూలై 21:పెద్దవాల్గోట్‌లో త్రిమూర్తి సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు గద్దల రాకేశ్, సాయిబాబా ప్రచారకులు రమేశ్, మాజీ సర్పంచ్ గద్దల గంగాధర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలోని ఎన్జీవోస్ కాలనీలో పద్మశాలీ సంఘం (తర్ప 37) ఆధ్వర్యంలో టీజీ ఎండీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఈరవత్రి అనిల్‌ను ఆదివారం ఘనంగా సన్మానించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈరవత్రి అనిల్ మొదటిసారి స్వగ్రామం కిసాన్‌నగర్‌కు వచ్చిన సందర్భంగా వీడీసీ సభ్యులు ఆ గ్రామంలో సన్మానించారు. - ఖలీల్‌వాడి/బాల్కొండ, జూలై 21

లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా శౌరిబాబు ఎన్నిక

అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తున్న గాడిపర్తి శౌరిబాబు

నందిపేట్, జూలై 21: నందిపేట్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా గాడిపర్తి శౌరిబాబుతోపాటు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంతో ఆదివారం లయన్స్ భవన్‌లో ప్రమాణస్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా గాడిపర్తి శౌరిబాబు, కార్యదర్శిగా గోపీనాథ్, కోశాధికారిగా నర్సయ్యను ఎన్నుకున్నారు. జిల్లా ప్రతినిధులు వి.లక్ష్మి, బసవేశ్వర్ నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. రీజినల్ చైర్మన్ అనిల్, జోనల్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా లయన్స్‌క్లబ్ వార్షికోత్సవం

కంఠేశ్వర్, జూలై 21 : జిల్లాకేంద్రంలోని ఎల్లమ్మగుట్టలో ఉన్న కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ భవనంలో లయన్స్ క్లబ్ డైమండ్ 27వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం 2024-2025 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సిర్ప రాజేశ్వర్, సెక్రటరీగా శ్రీనివాస్, ట్రెజరర్‌గా డి.రాజును ఎన్నుకోగా.. నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

వినాయక్‌నగర్, జూలై 21 : జిల్లాకేంద్రంలోని న్యాల్‌కల్ రోడ్డులో ఓ ఇంట్లో పేకాడుతున్నట్లు సమాచారం అందడంతో ఆదివారం మధ్యాహ్నం ప్రత్యేక టీమ్ దాడి చేసింది. లలితానగర్ లోని ఇంటిపై దాడులు నిర్వహించి, పేకాడుతున్న 10 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 10 సెల్‌ఫోన్లు, రూ.5,200 నగదును స్వాధీనం చేసుకున్నారు. నగదుతోపాటు పట్టుబడిన వారిని ఐదో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఎస్సై అశోక్ వారిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నారు.

గ్రామదేవతలకు జలాభిషేకం

కొలిప్యాక్‌లో గంగజలాన్ని ఊరేగిస్తున్న గ్రామస్తులు

జక్రాన్‌పల్లి, జూలై 21 : వర్షాలు సకాలంలో కురిసి, పంటలు బాగా పండాలని పలు గ్రామాల్లో వీడీసీల ఆధ్వర్యంలో గ్రామదేవతలకు ఆదివారం జలాభిషేకం చేశారు. కొలిప్యాక్ గ్రామకమిటీ ఆధ్వర్యంలో డప్పువాయిద్యాల మధ్య వలగొడుగుతో గంగజలాన్ని ఊరేగించారు. అనంతరం గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఢీకొండ హరితా శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బాలయ్య, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బోధన్ దవాఖాన సూపరింటెండెంట్‌గా శ్రీనివాస్ ప్రసాద్

శక్కర్‌నగర్, జూలై 21: బోధన్ జిల్లా ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్‌గా శ్రీనివాస్ ప్రసాద్ బదిలీపై రానున్నారు. డాక్టర్ రాహుల్ ఇటీవల బదిలీపై వెళ్లగా ఆయన స్థానం ఖాళీ అయ్యింది. బాన్సువాడ ఏరియా దవాఖాన, మాతాశిశు దవాఖాన సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ ప్రసాద్‌ను బోధన్‌కు బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బాన్సువాడ దవాఖానలో ఆయన సుదీర్ఘ కాలం సేవలు అందించి, దవాఖానకు జాతీయ అవార్డు తీసుకురావడంలో కీలకపాత్ర పోషించారు.

ఘనంగా గోపాలకాల్వ

రుద్రూర్, జూలై 21 : మండలకేంద్రంలో విఠలేశ్వర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గోపాల కాల్వ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. విఠలేశ్వర స్వామి చిత్రపటాన్ని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. పేలాలతో తయారు చేసిన లడ్డూలను పైకి ఎగిరేస్తూ గోపాల కాల్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి రాముశర్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు గెంటిల సాయిలు, చిదుర వీరేశం, శివ అప్ప, యువరాజు అప్ప, రాజేశ్వర్ అప్ప, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జీజీహెచ్ నుంచి మహిళ అదృశ్యం

సకినా

వినాయక్‌నగర్, జూలై 21: జిల్లా ప్రభుత్వ దవాఖాన నుంచి సకినా (60) అదృశ్యమైంది. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. బాల్కొండ మండలానికి చెందిన సదరు మహిళ తన కూతురు గర్భిణి కావడంతో డెలివరీ నిమిత్తం ఈ నెల 2వ తేదీన ప్రభుత్వ జనరల్ దవాఖానలో చేర్పించారు. 4వ తేదీ సాయంత్రం సమయంలో టీ తీసుకువస్తానని దవాఖాన నుంచి వెళ్లిన సకినా తిరిగి రాలేదు. ఆచూకీ లభించకపోవడంతో ఆమె కుటుంబీకులు ఆదివారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, ఆచూకీ తెలిసిన వారు 87126 59837 నంబర్ లేదా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని ఎస్‌హెచ్‌వో కోరారు.

బ్యుటీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

కోటగిరి, జూలై 21 : మండల కేంద్రంలో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో బ్యుటీషియన్ కోర్సుల్లో మహిళలకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు రమేశ్, రామకృష్ణ ఆదివారం తెలిపారు. మండలంలోని 20 మంది మహిళలకు 35 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8099587454, 9494821655 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

అషాఢమాసం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని 300 క్వార్టర్స్‌లో బోనాల పండుగను ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నగర మేయర్ దండు నీతూకిరణ్ హాజరై పూజలు చేశారు. జిల్లాకేంద్రంలో లక్ష్మీ సిల్క్స్ వారి ఆధ్వర్యంలో వినాయక్‌నగర్ మహాలక్ష్మి అమ్మవారికి బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరై బోనమెత్తుకున్నారు. - సుభాష్‌నగర్/ కంఠేశ్వర్, జూలై 18

కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్‌లో ఆదివారం ఊరపండగను ఘనంగా నిర్వహించారు. గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కొమ్ముల రజనీకాంత్, శ్రావణ్, చిన్నబాలయ్య, నర్సయ్య, ధన్‌రాజ్, సభ్యులు పాల్గొన్నారు. - మోర్తాడ్, జూలై21

రోడ్డుపై గుంత పూడ్చివేత

ఏర్గట్ల, జూలై 21: మండలంలోని బట్టాపూర్, వెల్కటూర్ గ్రామాల మధ్య ఉన్న కల్వర్టు పక్కన ప్రమాదకరంగా ఉన్న గుంతను బట్టాపూర్‌కు చెందిన పలువురు యువకులు ఆదివారం పూడ్చివేశారు. యువకులు దయానంద్, గంగాధర్ యాదవ్, నర్సయ్య యాదవ్, అశోక్, కండేల భూమేశ్, మనోజ్, రమేశ్ గౌడ్, ఇమామ్, నూకల గంగాధర్, కాటిపల్లి సాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మాట్లాడుతున్న ఎస్సై

బాల్కొండ, జూలై 21: రాబోయే 48 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నందున వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై యాసిర్ అర్ఫాత్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వాగులు, చెరువులు, కుంటలు పొంగి పొర్లే ప్రమాదముందని, ప్రజలు ప్రయాణాలను 48 గంటలు వాయిదా వేసుకోవాలని సూచించారు. వర్షంతో ఏదైనా సమస్య వస్తే వెంటనే 100 లేదా 87126 59860 నంబర్‌కు గానీ ఫోన్ చేయాలన్నారు.

బోధన్ మున్సిపల్ మేనేజర్, సిబ్బంది బదిలీ

బోధన్, జూలై 21: బోధన్ మున్సిపాలిటీ మేనేజర్ నరేందర్‌తో సహా పలువురు ఉద్యోగులను బదిలీ చేస్తూ కమిషనర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. మేనేజర్ నరేందర్‌ను భీమ్‌గల్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఖైసా మున్సిపాలిటీ నుంచి అతార్ అహ్మద్ ఫారూఖీని బదిలీ చేస్తూ ఉత్వర్వులు జారీ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్‌ను ఆదిలాబాద్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో నిజామాబాద్ పురపాలకశాఖ నుంచి ఎం.జయకుమార్‌ను బోధన్‌కు బదిలీ చేశారు. బోధన్ మున్సిపాలిటీలో సీనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న కె.శ్రీనివాస్ రావు, బి.బాల్‌రెడ్డి, విజయ్ సింగ్‌ను నిజామాబాద్‌కు బదిలీ చేశారు. ముగ్గురు బిల్ కలెక్టర్లను కూడా బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

బోధన్ రూరల్, జూలై 21: వన మహోత్సవంలో భాగంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములై మొక్కలను నాటాలని బోధన్ రూరల్ ఎస్సై నాగ్‌నాథ్ అన్నారు. ఆదివారం అమ్దాపూర్ గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు సాయన్న, సుమన్, గణేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి వేర్వేరు చోట్ల ఇద్దరు మృతి

వినాయక్‌నగర్/ఆర్మూర్‌టౌన్, జూలై 21: జిల్లాకేంద్రంలోని నాగారం ప్రాంతంలో చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. నాగారానికి చెందిన ఎస్‌కే అక్బర్ (26) నాగారం శివారులోని 80 క్వార్టర్స్ ప్రాంతంలో ఉన్న చెరువులో ఆదివారం చేపలవేటకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులోపడి, ఈతరాకపోవడంతో మృతిచెందాడు. స్థానికులు అగ్నిమాపక శాఖ వారికి వారికి సమాచారం అందించారు. స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నర్సింగ్‌రావు పర్యవేక్షణలో రిస్కూ టీమ్ సిబ్బంది నీటిలో మునిగిపోయిన యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఫైర్ ఆఫీసర్ అనంతరావు, లీడింగ్ ఫైర్‌మన్ ప్రశాంత్, డ్రైవర్ ఆపరేటర్ ప్రసన్న కుమార్, ఫైర్‌మన్ సతీశ్ సదరు యువకుడి మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడి తండ్రి అన్వర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఐదో టౌన్ ఎస్సై అశోక్ తెలిపారు.

ఆర్మూర్ మండలంలోని సుర్బిర్యాల్ గ్రామానికి చెందిన పల్లికొండ లక్ష్మణ్(29) అనే జాలరి చేపల వేటకు వెళ్లి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ప్రభుత్వ ఏరియా దవాఖానలో టీవీటీ క్లీనింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్న లక్ష్మణ్ విధులు ముగించుకొని శుక్రవారం సాయంత్రం ఇంటికి వచ్చాడు. అనంతరం ఇంటి నుంచి చేపల వేటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. సుర్బిర్యాల్ ఊర చెరువులో వల చుట్టుకొని మృతి చెందినట్లు ఆదివారం ఉదయం గుర్తించారు. మృతుడి తల్లి భూదేవి ఫిర్యాదు మేరకు ఎస్సై అంజమ్మ, సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది యువతి ఆత్మహత్య

మాక్లూర్, జూలై21: మానిక్‌బండార్ పరిధిలోని తండాలో దివ్య (20) జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. మృతురాలి మానసిక స్థితి బాగా లేదని, కండ్లు సరిగా కనిపించవని పేర్కొన్నారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

దుబాయ్‌లో గాదేపల్లి వాసి మృతి

నందిపేట్, జూలై 21: డొంకేశ్వర్ మండలం గాదేపల్లి గ్రామానికి చెందిన మూట కిషన్(40) అనారోగ్యంతో దుబాయ్‌లో మృతిచెందాడు. ఎనిమిదేండ్లుగా దుబాయ్‌లోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కొన్ని రోజులుగా కిషన్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అక్కడే చికిత్స పొందుతూ పది రోజుల క్రితం మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు. ఆదివారం మృతదేహం గ్రామానికి చేరుకోగా అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★మీ పిల్లల బంగారు భవిష్యత్తు కొరకు... 1 లక్షకే 121 చ.గజాల ప్లాట్, 20 మొక్కలతో, ఎర్రచందనం, మహాగని. ప్రీ మెయింటెనెన్స్, 10 సం॥లలో లక్షల ఆదాయం. Cont: 8500664291. NT-325890

OLD AGE HOME

★ఒమేగా హోంకేర్: వంట, ఇంటిపని, వృద్ధులకు, పేషెంట్లను, చిన్నపిల్లలను 24 గం॥ చూసుకొనుటకు మీ ఇంటివద్దకే Sr. కేర్‌టేకర్స్‌ని పంపబడును, హైదరాబాద్. 8977639664, 8977639665. NT-325766-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/- ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

GST వర్తించును

సెల్: 91827 77590

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, జూలై 21 : జిల్లావ్యాప్తంగా గురుపౌర్ణమి వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానాలు చేశారు. పలువురు తమ గురువును సన్మానించారు. జిల్లాకేంద్రంలోని తేనెసాయి ఆలయంలో, ధర్పల్లి మండలం రేకులపల్లిలో ఉన్న శ్రీ సాయి గురుదత్త ఆశ్రమంలో గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. పొతంగల్ మండలంలోని సాయిబాబా ఆలయంలో వేడుకలను నిర్వహించారు. ఎంపీడీవో మనోహర్ దంపతులు పూజల్లో పాల్గొన్నారు. రూరల్ మండలంలోని మల్లారం శివారులో ఉన్న లింగేశ్వర గుట్ట ఆశ్రమంలో వేడుకలను నిర్వహించారు. ఆశ్రమ వ్యవస్థాపకులు పిట్ల కృష్ణ మహారాజ్ గురువు ప్రాముఖ్యతను ఉద్బోధించారు. పిట్ల కృష్ణ మహారాజ్‌కు భక్తులు తుల భారం వేసి ప్రేమాభిమానాలను చాటుకున్నారు. 25 మంది శిష్యులకు గురు ఉపదేశం చేశారు. జిల్లాకేంద్రంలోని కోటగల్లీలో ఉన్న శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో వేడుకలను నిర్వహించారు. నవీకరణ, మౌలిక వసతుల కల్పనలతో అదనపు గదిని ప్రముఖ కవి ఆయాచితం నాగరాజుశర్మ ప్రారంభించారు. జిల్లాకేంద్రంలోని రామకృష్ణ సేవా సమితిలో అధ్యక్షుడు సాయిప్రసాద్, ఉపాధ్యక్షులు యోగా రాంచంద్రం, ప్రకాశ్‌గౌడ్, తోట రాజశేఖర్ ఆధ్వర్యంలో విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. శ్రీరామకృష్ణ పరమహంస జీవిత చరిత్ర చలన చిత్రాన్ని ప్రదర్శించారు. బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ రామమందిరంలో పత్రీజీ పీఠం ఆధ్వర్యంలో, బోధన్ షిరిడీ సాయిబాబా మందిరంలో పూజలు నిర్వహించారు. మోర్తాడ్, కమ్మర్‌పల్లి, ఎడపల్లి శ్రీరామ మఠంలో వేడుకలు నిర్వహించారు. రెంజల్ మండలం కందకుర్తిలో సీతారాం సంత్ సేవ ఆశ్రమంలో సీతారాం త్యాగి మహారాజ్ శిష్యులు స్వామిజీకి పాదపూజ చేసి ఆశీర్వాదం పొందారు. నవీపేట మండల కేంద్రంలోని లింగం గుట్ట శనీశ్వర సహిత స్వయంభూ శివాలయంలో సిద్దేశ్వర మహారాజు హాజరై భక్తులకు ప్రవచనాలు చేశారు. ఆర్మూర్ పట్టణంలోని దోబీఘాట్ వద్ద జ్యోతిర్లింగ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నందిపేట్ కేదారేశ్వర ఆశ్ర